వీధి వ్యాపారులకు భరోసా

- రూ.60 లక్షలతో ముఖ్య కూడళ్లలో స్ట్రీట్ మార్కెట్లు
- తీరిన చిరువ్యాపారుల కష్టాలు
- తొలగిన ట్రాఫిక్ ఇబ్బందులు



వినాయక ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రీట్ మార్కెట్


పండ్లను కొనుగోలు చేస్తున్న ప్రజలు

కర్నూలు (న్యూటౌన్): ఒకప్పుడు నెత్తిమీద గంప పెట్టుకుని ఎండనక, వాననక ఇంటింటికీ తిరిగేవారు. ఎక్కడపడితే అక్కడ వ్యాపారాలు చేసుకోవడం వల్ల వ్యాపారులకు, కొనుగోలుదారులకు ఇబ్బందులు ఏర్పడేవి. అలాగే ఈ వ్యాపారాల వల్ల ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తేది. గత ప్రభుత్వంలో రోడ్ సైడ్ వ్యాపారులు, వీధి వ్యాపారులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వీరికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం అలాగే మహిళలకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు అమలు చేయడంతో వారి కష్టాలు తీరిపోయాయి. చిరువ్యాపారులు ఎక్కడెక్కడ నుండో వచ్చి పట్టణాల్లో వ్యాపారాలు చేసుకోవడం వల్ల అనేక ఇబ్బందులు వచ్చేవి.దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వీరికి గుర్తింపుకార్డులు మంజూరు చేసింది. గుర్తింపు కార్డులున్న వీధి వ్యాపారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా వడ్డీ లేని రుణాలు రూ.10 వేలు మంజూరు చేస్తోంది. దీన్ని నిర్ణీత సమయంలో చెల్లించిన వారికి రూ.50 వేల రుణం మంజూరు చేస్తోంది. దీని వల్ల వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ప్రభుత్వం వీరికి అండగా నిలుస్తోంది. ముఖ్య కూడళ్లలో స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు నగరంలో మొట్టమొదటిసారిగా స్ట్రీట్ మార్కెట్స్ వెలిశాయి. ఒకే చోట వ్యాపారం చేసుకునే అవకాశంతో పాటు వారికి సౌకర్యాలు ప్రభుత్వం కల్పించింది. స్మార్ట్ సిటీలో భాగంగా తప్పనిసరి స్ట్రీట్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ యంత్రాంగం అమలు చేసింది. తద్వారా కొనుగోలుదారులకు వ్యాపారులకు ఇబ్బందులు తొలగాయి.

ఎక్కడెక్కడంటే...

కర్నూలు నగరంలో కేసీ కెనాల్ వినాయక ఘాట్, వాల్‌మార్ట్ ఎదురుగా, కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్ సమీపంలో రూ.60 లక్షల వ్యయంతో కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు స్ట్రీట్ మార్కెట్‌లను ఏర్పాటు చేశారు. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి వారి వ్యాపారానికి చేయూతనందించారు.

మా కష్టాన్ని ప్రభుత్వం గుర్తించింది



ఒకప్పుడు ఎండనక, వాననక రోడ్లపై తోపుడు బండ్లలో పండ్లు పెట్టుకుని వ్యాపారం చేసేవాళ్లం. ప్రస్తుతం మా కష్టాలను ప్రభుత్వం గుర్తించి వీధి వ్యాపారులకు షెడ్లు ఏర్పాటు చేసింది. చల్లటి నీడలో వ్యాపారం చేసుకునేందుకు మంచి అవకాశం కల్పించింది. మాలాంటోళ్ల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– వడ్డె సావిత్రమ్మ, వీధి వ్యాపారి

నీడ పట్టున వ్యాపారం



గత 30 ఏళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తున్నా. గతంలో ఏ ప్రభుత్వం వీధి వ్యాపారుల కష్టాలను గుర్తించలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా కష్టాలను గుర్తించి పండ్ల వ్యాపారానికి ఒక వేదికను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. గతంలో రోడ్లపై తోపుడుబండ్లను పెట్టుకుని వ్యాపారం చేసుకుంటుంటే ట్రాఫిక్ సమస్య అనేవారు.ప్రస్తుతం ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా నిలువ నీడలో పండ్ల వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వం చేయూతనివ్వడం శుభపరిణామం.

– లక్ష్మీదేవి, వీధి వ్యాపారి

ఒకేచోట అన్ని రకాల పండ్లు లభ్యం



కర్నూలు నగరంలో కొత్తగా నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేసిన స్ట్రీట్ మార్కెట్ల వద్ద అన్ని రకాల పండ్లు ఒకే చోట కొనుగోలు చేసే అవకాశం కల్పించడం చాలా బాగుంది. గతంలో రోడ్లపై తోపుడుబండ్లలో పండ్లను కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం స్ట్రీట్ మార్కెట్‌లలో అన్ని రకాల పండ్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు వీధివ్యాపారులు నీడలో వ్యాపారం చేసుకునే అద్భుత అవకాశం కల్పించడం మంచి పరిణామం.

– మాసుంబాషా, లెక్చరర్, కర్నూలు

స్మార్ట్ సిటీలో భాగంగానే ఏర్పాటు



స్మార్ట్ సిటీ రూపకల్పనలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం.చిరు వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ వ్యాపారం చేసుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ముఖ్య కూడళ్లలో ప్రతిరోజూ ఇదే సమస్య. దీన్ని పరిష్కరించేందుకు వ్యాపారులందరూ ఒకేచోట వ్యాపారం చేసుకునే విధంగా సౌకర్యాలు కల్పించాం. ఇప్పటికే వినాయక ఘాట్, వాల్‌మార్ట్, కృష్ణానగర్ ఐటీసీ ప్రాంతాల్లో స్ట్రీట్ మార్కెట్‌లను ఏర్పాటు చేశాం. త్వరలోనే కొత్తబస్టాండు,ఉల్చాల రోడ్డు ప్రాంతాల్లో స్ట్రీట్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– షాకీర్ హుస్సేన్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

జగనన్నతోనే ప్రజాసంక్షేమం

- చనుగొండ్లలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ప్రచారం


చనుగొండ్లలో కోట్ల హర్ష, సతీష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

గూడూరు రూరల్: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు.వారు గురువారం చనుగొండ్ల, వై.ఖానాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన కోట్ల హర్ష, సతీష్‌లకు స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కోడుమూరు నుంచి చనుగొండ్ల మీదుగా గూడూరుకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎన్నికల్లోపు రోడ్డును పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మకుండా ప్రజలందరూ వైఎస్ జగన్‌కే మద్దతు తెలిపి మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కోట్ల హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకుతిన్నాయని, అలాంటి పాలనను ఎవరూ కోరుకోవడం లేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ఎలాంటి లంచాలు, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు ఇంటివద్దకే వచ్చాయన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే పేదలు, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు. గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, పట్టణ కన్వీనర్ అబేలు, విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ రంగయ్య, గోవిందరెడ్డి, మహేశ్వరరెడ్డి, మాధవస్వామి, దౌల, మహేశ్వరరెడ్డి, రామచంద్ర, నరసింహరెడ్డి, సుందరం, నాగరాజు, దివాకర్‌రెడ్డి, రఘురెడ్డి, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం


పాత కల్లూరులో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

- చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆయన గురువారం కల్లూరు అర్బన్ 37, 33వ వార్డులలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదల అభ్యున్నతి కోసం నవరత్నాల పథకాలు అమలుచేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పేదల జీవన ప్రమాణాలు మెరుపడ్డాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలతో పాటు చెప్పని వాటిని కూడా అమలు చేశామన్నారు. కరోనా మహమ్మారి ప్రభావంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా పేదల బాగుకోసం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు.

చంద్రబాబును నమ్మితే అధోగతే: ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మళ్లీ మోసగించేందుకు టీడీపీ నేతలు ప్రజల ముందుకు వస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని ఎమ్మెల్యే కాటసాని సూచించారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్పొరేటర్లు, ఆయా వార్డుల్లోని నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు: నియోజకవర్గంలోని ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. గురువారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని 14, 15వ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం స్వీప్ కార్యక్రమంలో భాగంగా కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కల్లూరు ఎంఈఓ ఆఫీస్ వరకు నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలనలో 14, 15 కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్లు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, సార్వత్రిక ఎన్నికల్లో తమకు నచ్చిన వారికి నిర్భయంగా ఓటు వేయవచ్చన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లకు ఓటు హక్కు స్వేచ్ఛపై (స్వీప్) సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం ర్యాలీ నిర్వహించామన్నారు. యువత ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి, ఓటును సద్వినియోగం చేసుకునేలా చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ మునివేలు, ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి, బూత్ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కల్లూరు ఓటర్లు @ 3.25 లక్షలు

- జిల్లాలో ఇక్కడినుంచే అత్యధికంగా ఓటరు నమోదు దరఖాస్తులు
- ఏటికేడు పెరుగుతున్న సంఖ్య

పాణ్యం: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఓటర్లు కలిగిన నియోజకవర్గం పాణ్యం. ఇక్కడ ఏటేటా ఓటర్లు పెరుగుతూనే ఉన్నారు. 2019తో పోల్చితే ఈసారి ఏకంగా 37544 మంది ఓటర్లు పెరిగారు. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి పాణ్యం నియోజకవర్గంలో 2,88,031 మంది ఓటర్లు, 286 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటికివరకు 3,25,575 మంది ఓటర్లు నమోదవగా 350కి పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటర్లలో చైతన్యం రావడం, ఎన్నికల సంఘం పదేపదే అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో 18 ఏళ్లు నిండిన యువతీయువకులందరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కల్లూరు మండలం నుంచి దరఖాస్తులు అత్యధికంగా వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల వరకు ఎన్నికల కమిషన్ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. వచ్చిన ప్రతి దరఖాస్తును ఆయా బీఎల్‌ఓలకు పంపించి క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక పంపతున్నా, ఎలాంటి ఒడిదుడుకులకు తావులేకుండా ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందిస్తున్నారు.

కర్ణాటక మద్యం, నాటుసారా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నాటుసారా, మద్యంను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలోని కోడుమూరు, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలు, అక్రమ మద్యం విక్రయించే వారిపై దాడులు నిర్వహించి నాటుసారా, కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు గురువారం తెలిపారు. వెల్దుర్తి మండలంలో రామచంద్రుడు, లక్ష్మీదేవమ్మను అరెస్ట్ చేసి వారి నుంచి 13 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు, కోడుమూరు మండలం లద్దగిరిలో బోయ ఈశ్వరయ్య, కృష్ణగిరి మండలం కోయిలకొండలో యోగీశ్వరయ్యలను అదుపులోకి తీసుకుని 11 మద్యం బాటిళ్లు, 40 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో కర్నూలు డివిజనల్ టాస్క్ ఫోర్స్ సీఐ నరసానాయుడు, ఎస్‌ఐలు అలీబేగ్, వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజానికి మేలు చేసేదే కవిత్వం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

పాణ్యం: సమాజం మేలు కోరేది కవిత్వమని, ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని చైర్మన్ శాంతిరాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ స్థితి, గతిని మార్చే శక్తి కవిత్వానికి ఉందన్నారు. చింతామణి నాటకం లేకుంటే వేశ్యవృత్తి ఇంకా కొనసాగేదన్నారు. గుర్రం జాషువా, కృష్ణశాస్త్రి, సత్యనారాయణ, విశ్వనాథం వంటి వారు కవిత్వం ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చారని వివరించారు. అనంతరం వివిధ భాషల్లో రచించిన కవితా సంపుటిలను ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ శాంతిరాముడు, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డీన్ అశోక్‌కుమార్ గోరటి వెంకన్నను ఘనంగా సన్మానించారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ జయమ్మ

ఓర్వకల్లు: మండల పరిధిలోని సోమయాజులపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సౌజన్యంతో నిర్వాహకులు నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ జయమ్మ గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు వచ్చిన యువతను ఆమె అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌వెంకటరెడ్డి, ఆకుల మహేష్, రాజేష్, కార్యకర్తలు రమణ, తిరుపాలు, చందు, మద్దయ్య,భాస్కర్,అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాణ్యం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఫణి కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన సౌకర్యాలు, ఓటర్లకు కల్పించాల్సిన వసతులపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మంచినీరు, ఫర్నీచర్, ర్యాంప్‌లు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. సిబ్బంది వెంట ఉన్నారు.

మైనార్టీలకు నీట్, ఈఏపీసెట్ ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: మైనార్టీ అభ్యర్థులకు నీట్, ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకు ఉస్మానియా కాలేజీలోని రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (ఆర్‌సీఈడీఎం) వారి ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి ఇంటర్మీడియెట్ సెకండియర్ హాల్ టికెట్‌తో పాటు, నీట్, ఏపీ ఈఏపీ సెట్‌కు ఆన్‌లైన్‌లో చేసుకున్న కాపీ, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి ఈనెల 22 నుంచి 24వ తేదీ లోపు ఉస్మానియా కాలేజీలోని రూం నంబరు 54లో అందజేయాలన్నారు. వివరాలకు 94417 61178, 98498 96996 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నటనపై శిక్షణ

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఫిలిం, టీవీ, థియేటర్ రంగంలో ఆసక్తి గల యువతకు నటనలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, శిక్షణ నిర్వాహకులు జల్లు కుమార్ తెలిపారు. ఈనెల 24 నుంచి మే 30వ తేదీ వరకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శిక్షణ ఉంటుందని, 15 నుంచి 25 ఏళ్ల వయసు కలిగి తెలుగులో చక్కగా మాట్లాడగలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జల్లు కుమార్ 93913 36005 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

గడివేముల: మండలంలోని బొల్లవరం రస్తాలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మాచెర్ల లక్ష్మిచెన్న కేశవ స్వామి ఆలయ నిర్మాణానికి అర్చకులు కేశవయ్య అధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. గడివేముల గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయం నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చెన్నకేశవయ్య, కమిటీ నిర్వాహకులు సీవీ రమణయ్య, రమణారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, నరహరి వెంకటేశ్వర్లు, జక్కుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

సి.బెళగల్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపధ్యంలో కోడ్ అమలులో ఉంటుందని, ప్రజలు, రాజకీయ పార్టీలు, నాయకులు నియమావళిని తప్పక పాటించాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. ఆమె గురువారం మండలంలోని బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి తదితర గ్రామాలలో పర్యటించి ఎన్నికల కోడ్ అమలులో భాగంగా చర్యలు తీసుకున్నారు. ఆయా గ్రామాలలో పబ్లిక్ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లను తొలగించారు. ప్రజలకు, నాయకులకు ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆయా గ్రామాల్లో నాయకులతో మాట్లాడుతూ.. మతపరమైన ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని, ప్రచారాలకు అనుమతులున్న వాహనాలనే వాడాలని సూచించారు. ప్రజలకు నియమావళి, జాగ్రత్తలను, చట్టాలను తెలియజేశారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్ జయప్రకాష్ తదితరులు ఉన్నారు.

చలువ పందిరి ఏర్పాటు


కోడుమూరు పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిరి, చలివేంద్రం

కోడుమూరు రూరల్: వేసవి కాలం ఎండలు మండుతుండడంతో కోడుమూరులోని పాతబస్టాండ్ సెంటర్‌లో నిలువనీడ లేక, గుక్కెడు మంచినీళ్లు దొరకక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రయాణికుల సౌకర్యార్థం చలువ పందిరి, చలివేంద్రాలను గురువారం ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయం చేయండి

కల్లూరు: కళాశాల చెత్తను పొలంలో వేసి నిప్పు పెట్టడంతో పండ్ల మొక్కలు కాలిపోయాయని, న్యాయం చేయాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు.. మండలంలోని పెద్దటేకూరుకు చెందిన ఆళ్ల చిరంజీవి రెడ్డికి దూపాడు గ్రామ పొలిమేర సర్వే నంబర్ 52/బి2లో 4.30 ఎకరాల పొలం ఉంది. పొలంలో అంజీర చెట్లు, గట్టుపై టెంకాయ చెట్లను నాటి పెంచుతున్నాడు. పొలం చుట్టూ కంచె వేయించాడు. ఆ పొలం పక్కనే కె.వి సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఉంది. కళాశాలలోని చెత్తను పొలం కంచె పక్కన వేసి నిప్పుపెట్టడంతో మంటలు విస్తరించి టెంకాయ చెట్లు, అంజీర చెట్లు కాలిపోయాయని బాధితుడు గురువారం ఉలిందకొండ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ


ఏ.గోకులపాడులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ విజయశేఖర్

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని ఏ.గోకులపాడు, కె.మార్కాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సదుపాయాలు, సౌకర్యాలను పరిశీలించామన్నారు. ఇతర శాఖ అధికారులతో కలిసి పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన వసతి, సౌకర్యాలపై చర్చించినట్లు చెప్పారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్‌ఐ శ్రీనివాసులు వెంట ఉన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నదీతీర గ్రామాలైన కె.సింగవరం, ఈర్లదిన్నె గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని, కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కూలీలందరికీ ఉపాధి పనులు


కోడుమూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: గ్రామాల్లో పనులు చేసే కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించనున్నట్లు ఏపీఓ మోదీన్‌బాషా తెలిపారు. గురువారం కోడుమూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేసి కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారీ వేతనం రూ.272 కూలీలకు పడుతుందని, పనుల్లో తప్పనిసరిగా నాణ్యత పాటించాలన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే పనులు కల్పిస్తామన్నారు. మండుతున్న ఎండల దృష్ట్యా కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు వెళ్లాలన్నారు. ప్రతి కూలీ వంద రోజుల పని దినాలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సూచించారు.

పెద్దాసుపత్రిలో రద్దీ నియంత్రణకు చర్యలు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొన్ని విభాగాల్లో రోగుల రద్దీని నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ మేరకు రెండు రోజుల క్రితం రాష్ట్రంలోని బోధనాసుపత్రుల అధికారులతో డీఎంఈ సూచనలు, సలహాలు తీసుకున్నారు. ముఖ్యంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్ తదితర విభాగాల్లో రోగుల రద్దీ అధికంగా ఉంటోంది. కొన్నిసార్లు మధ్యాహ్నం 1 గంట వరకు సైతం ఓపీ చూడాల్సి వస్తోంది. దీనివల్ల వైద్యులకు పనిభారంతో పాటు రోగులకు సమయం మీరిపోతోంది. ఈ సమస్యలను గుర్తించిన ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. రద్దీ ఉన్న విభాగాల్లో ఓపీ నిర్వహించే రోజున ప్రస్తుతం ఒక యూనిట్ వైద్యులు మాత్రమే ఓపీ రోగులకు చికిత్స అందిస్తున్నారు. అలాగాకుండా రెండు యూనిట్ల వైద్యులు ఒకే రోజు ఓపీ చికిత్స అందిస్తే రద్దీ తగ్గుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీనివల్ల వైద్యులకు పనిభారం తగ్గడంతో పాటు రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందే అవకాశముందని వారు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అధికారులు, వైద్యుల సలహాలు, సూచనలను రాష్ట్ర ఉన్నతాధికారులు తీసుకున్నారు. ఈ నూతన విధానాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం కేసీ కాల్వకు గురువారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.060 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.